# బార్బర్ అడ్వెంచర్స్

◆ సి. రవీంద్రనాథ్ ◆

## ఆ పోస్టుమాన్‌కి బార్బర్‌షాపుకి వెళ్లి క్షవరం చేయించుకోవాలంటే ఎప్పుడు భయమే.

ఏ బార్బర్ యే గాటు పెడతాడోయోమోనని అతని భయం. ఆ రోజు అతను బార్బర్‌షాపుకి వెళ్లేసరికి సీట్లనిండా జనం వున్నారు. బ్రతుకు జీవుడా అంటూ వెనక్కి తిరగబోయేంతలో బార్బర్ యెగిరి గంతేసి ముందుకొచ్చి పోస్టుమాన్ చేయిపుచ్చుకొన్నాడు. "రండిసార్" ఇవుడే ఒకసీటు ఖాళీ అయింది అంటూ పోస్టుమాన్‌కి బలవంతంగా ఒక కుర్చీలోకి తోసాడు. పోస్టుమాన్ ప్రమేయం లేకుండానే క్షవరం ప్రారంభించాడు. పోస్టుమాన్ జేబులో వున్న తన ఇంటి అడ్రసు కాగితాన్ని ఒకసారి తడిమి చూసుకొన్నాడు. ఒకవేళ జరగరానిదేమన్నా జరిగితే ఇంట్లో వాళ్లకి తెలియడానికి జేబులోవున్న ఇంటి అడ్రసు కాగితం వుపయోగిస్తుందని పోస్టుమాన్ అభిప్రాయం.

బార్బర్ పోస్టుమాన్ జుట్టు మీద ఇష్టమొచ్చినట్టుగా నీళ్ళు కొట్టి ఒక మంచి ఇంగ్లీషు పాట అందుకొని జుట్టుని కుదుళ్ళ లోంచి పీకసాగాడు. కసిగా కత్తెరతో ఇష్టమొచ్చిన రీతిలో కత్తిరించసాగాడు. పోస్టుమాన్ మాత్రం ఎప్పటిలాగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కూర్చున్నాడు.

ఈ వూళ్లో ప్రతివాళ్లు సైకిళ్ళు తొక్కుతున్నారు. రోజు రోజుకి సైకిళ్ళు తొక్కేవాళ్ల సంఖ్య పెరిగిపోతోంది. యు.సీ! ఎవరిష్టం వాళ్లది. ఈ వూళ్ళో వీధులు ఒకరి సొమ్ము కాదుకదా. వాటిలో యెవరైన సైకిళ్లు తొక్కవచ్చు. ఈ సైకిలు తొక్కటమనేది రోజు రోజుకి పెరిగి పెద్ద ఫ్యాషన్‌గా మారుతోంది. అవుడే ఏమైంది ఆడవాళ్ళు కూడా సైకిలు తొక్కేరోజు వచ్చినా ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు. ఆడవాళ్ళకు కూడా ఇవి ఈ మధ్య ఎక్సర్‌సైజే అన్నాడు బార్బరు. నువేమంటావన్నట్టుగా క్షవరం ఆపి పోస్టమాన్ వంక చూసాడు బార్బరు.

మధ్యలో మనకెందు కొచ్చింది అనుకొని ఔనన్నట్టుగాతలవూపాడుపోస్టుమాన్.

బార్బర్ తిరిగి చెప్పసాగాడు. "స్త్రీలు కూడా పురుషుల్లా నమానంగా వుండేందుకు రకరకాలుగా ప్రయత్నించేస్తున్నారు. కొంత మంచి చేస్తున్నా ప్రయత్నాలు చూస్తే ఆశ్చర్యం వేస్తుంది కూడా. ఈ మధ్య మెన్ కిన్నీయెవెన్యూ నించి మంగలి సామాన్లు తీసుకొని రమ్మని నాకు కబురొచ్చింది. వెళ్లాను. నేను వెళ్లేసరికి స్కర్టు వేసేనుకొన్న ఒకమ్మాయి ఆ వీధిలో సైకిలు తొక్కుతోంది. నాకు ఏ ఇంటినుంచి కబురొచ్చిందో ఆ ఇంటి తలుపు తట్టాను. ఇంట్లో నన్ను ఒక గదిలో కూర్చోపెట్టారు. ఇంతకు ముందు వీధిలో సైకిలు తొక్కిన ఆమ్మాయి వచ్చినా యెదురుగా వున్న కుర్చీలో కూర్చుంది. "నాకు షేవ్‌చెయ్యి" అంది. ఆమెకు గడ్డాలు మీసాలు లేవు షేవ్ చేయటానికి. అదేమాట అడిగాను ఆశ్చర్యంగా. "లేవుకాబట్టే చేయమన్నాను. గడ్డాలు మీసాలు ఎందుకు పెంచకూడదు అంది కోపంగా అంతే మంగలి సామాన్లు అన్నీ తీసుకొని వీధిలోకి పరిగెత్తాను అంటూ గడ్డం చేయడం ఆపి ఒక ప్లాస్టరు ముక్క తెచ్చి పోస్టుమాన్ గడ్డానికి కత్తిగాటు తగిలినచోట అంటించాడు.

●●●

**అమ్మాయి వచ్చి కుర్చీలో కూర్చుని 'నాకు షేవ్ చెయ్యి' అంది.**

●●●


బార్బర్ చెప్పే కథలు వినటం గాటులు పెట్టించుకొని ప్లాస్టర్లు అంటించుకోవడం పోస్టుమాన్‌కి అలవాటే. ఈసారి మొహం మీద ఎన్ని ప్లాస్టర్లతో వెళ్లగలుగుతానో కదా అనుకొన్నాడు పోస్టుమాన్.

బార్బరు గడ్డం చేయడం ఒక్క క్షణం ఆపాడు. తిరిగి క్షవరంతోపాటు మరో కథ ప్రారంభించాడు.

"ఇటీవలి కాలంలో ఇంత విచిత్రమైన సంఘటనను గూర్చి ఎవరు వినివుండరు. ఒకరోజు మా షాపుకి హెయిర్ కటింగ్ చేయించుకోటానికి ఒక వ్యక్తి వచ్చాడు. అతనిపేరు మిస్టర్ ప్లుంకెట్. అతని తల కోడిగుడ్డులా వుంది. నెత్తిమీద ఒక్క వెంట్రుకైనా లేదు. అతనికి క్షవరం చేయడం యెలాగని ఆశ్చర్యపడ్డాను. అయితే అతను వచ్చింది క్షవరం చేయించుకోటానికి కాదు అన్న విషయం తరువాత తెలిసింది. తన బట్టతలమీద వెంట్రుకలు మొలిచే మార్గమేదైనా వుంటే చెప్పమని ప్రాధేయపడ్డాడు. ఏవైనా హెయిర్ టానిక్‌లు వుంటే ఇవ్వమని మరీ మరీ అడిగాడు. నేను ఒక హెయిర్ టానిక్ కనిపెట్టానని దాన్ని ఎనిమిది వారాలపాటు వాడితే ఎలాంటి బట్టతలమీదైనా వెంట్రుకలు మొలవడం ఖాయమని చెప్పాను. మిస్టర్ ప్లుంకెట్ యెగిరి గంతేసాడు. వంద డాలర్లు తీసుకొని నా ఇష్టమొచ్చిన ఫార్ములా రాసిచ్చాను. ఆ ఫార్ములాలో ప్రమాదకరమైనవేవి కాకుండా ఆల్‌మండీ ఆయిల్, రోజ్‌వాటర్, టెంచర్ ఇలాంటివి ఓ ఐదారు వుండేట్టుగా

అప్పటికప్పుడు సృష్టించిన ఫార్ములాని అన్ని మందుల షాపులో కొని ఇంట్లో సమపాళ్ళలో కలుపుకొని ఎనిమిది వారాలు తలకు వేసుకోమన్నాను. ఆ ఫార్ములా తీసుకొని మిస్టర్ ప్లంకెట్ ఆనందంగా వెళ్ళిపోయాడు. ఆ తరువాత ఆయన వారం వారం ఈ షాపుకు గడ్డం చేయించుకోటానికి వచ్చేవాడు. వచ్చినపుడల్లా నేనిచ్చిన హెయిల్ టానిక్ వాడుతున్నానని చెప్పేవాడు. నేను మనసులో నవ్వుకొనేవాడ్ని. నాలుగు వారాలు తిరగేనరికి మిస్టర్ ప్లంకెట్ తలపై వత్తుగా జుట్టు రాసాగింది. నాకే ఆశ్చర్యమనిపించింది. ఆరు వారాల తరువాత ఓ రోజు మిస్టర్ ప్లంకెట్ నా షాపుకి వచ్చాడు. తలపై వున్న టోపి తీసాడు."


"ఆశ్చర్యం" మిస్టర్ ప్లంకెట్ తలమీద తుమ్మెద రెక్కల్లా నల్లగా మెరుస్తున్న వత్తయిన



జుట్టు కనిపించింది. అంతా మీ దయ అన్నాడు మిస్టర్ ప్లంకెట్ నవ్వుతూ. రెండు మూడు వారాలుగా ఆలోచిస్తున్నాను. ఎంత ఆలోచించినా మిస్టర్ ప్లంకెట్‌కి నేను వ్రాసిచ్చిన ఫార్ములా గుర్తుకు రావడం లేదు. మిస్టర్ ప్లంకెట్‌ని షాపులో కూర్చోపెట్టాను. ఒక సీసాడు చల్లని లైమ్ తెప్పించి మార్యాద చేసాను. కబుర్లలోకి దింపాను. ఆ మాట, ఈ మాట చెప్పి ఆ ఫార్ములా వ్రాసివున్న పుస్తకం ఎక్కడో పోయిందని కాబట్టి నేను వ్రాసిచ్చిన ఫార్ములా కాగితాన్ని ఒకసారి తెచ్చియిస్తే అది దేశంలో వున్న అనేక మంది బట్టతల వాళ్ళకి వుపయోగపడుతుందని నచ్చచెప్పాను.

"మిస్టర్ ప్లంకెట్ సీసాడు లైమ్ త్రాగేసి పెద్దగా నవ్వేసాడు. బట్టతలమీద వెంట్రుకలు మొలిపించే ఫార్ములా అనేది అసలు లేనే లేదని నేను పొరపాటున వ్రాసిచ్చిన పిచ్చి ఫార్ములా నిజంగా బట్టతలమీద వెంట్రుకలు మొలిపించే మంచి టానిక్‌గా రూపొందిందన్న విషయం తనకు తెలునని చెప్పాడాయన.

ఒక్క గంట బ్రతిమాలాను. కాస్త మెత్తపడ్డాడు. వంద డాలర్లకు నేనమ్మిన ఫార్ములాను ఐదు వందల డాలర్లకు తిరిగి నాకు అమ్మడానికి



సిద్ధపడ్డాడు. ఫార్ములా నాకు అమ్మకుండా తానే ఆ టానిక్‌ని అమ్ముకొంటే లక్షలు, కోట్లు గడించగలనని, అయినా విశ్వాసంకొద్ది ఆ ఫార్ములాను నాకు అమ్ముతున్నానని నొక్కి వక్కాణించాడు.

ఐదువందల డాలర్లకి మిస్టర్ ప్లంకెట్ నుంచి కొన్న ఆ ఫార్ములాతో హెయిర్ టానిక్ తయారు చేసి సీసా పదిరూపాయలకి అమ్మాలని నిశ్చయించుకొన్నాను. ఈ వూళ్ళో నాకో స్వంత ఫ్లాటు వుంది. ఆ ఫ్లాటు అమ్మేసి హెయిర్ టానిక్ సీసాలకింద మార్చాను. మంచి పబ్లిసిటీ చేసి ఆ సీసాలు చాలా అమ్మాను. ఎనిమిది వారాలు కాదు కదా పద్దెనిమిది వారాలైనా ఒక్క బట్టతలవాడి తలమీద ఒక్క వెంట్రుక కూడా మొలవలేదు. దాంతో చాలా పెద్ద గొడవైంది. వూళ్లో పెద్దలు కొందరు వచ్చి ఇక ఈ హెయిర్ టానిక్ అమ్మడం మానివేయమన్నారు. మానకపోతే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని గట్టిగా హెచ్చరించారు. గత్యంతరంలేక వ్యాపారం మూసేసాను. ఇంతకి మిస్టర్ ప్లంకెట్ తలమీద వెంట్రుకలు మొలిపించిన ఆ హెయిర్ టానిక్ మిగతావారి తలల మీద వెంట్రుకలు ఎందుకు మొలిపించలేకపోయిందో తెలుసా?" అడిగాడు బార్బర్ పోస్టుమాన్ దవడమీద మరో గాటుపెట్టి ప్లాస్టర్ వేస్తూ. తెలియదన్నట్టుగా తల అడ్డంగా వూపాడు పోసుమాన్.

బార్బర్ తిరిగి చెప్పసాగాడు "ఆ విషయం తెలుసుకోడానికి మిస్టర్ ప్లంకెట్ ఇల్లు వెతుక్కుంటూ వెళ్లాను. అప్పటికే ప్లంకెట్ ఇల్లు ఖాళీచేసి వారం రోజులైంది. అయితే ఇంటి యజమాని ఓ విచిత్రమైన విషయాన్ని చెప్పాడు. మిస్టర్ ప్లంకెట్‌కి ఓ అన్నయ్య వున్నాడు. ఇద్దరు కవల పిల్లలు వాళ్లల్లో ఒకరికి బట్టతల, మరొకరికి వత్తుగా జుట్టు వున్నాయట. మొదట నా దగ్గరికి వచ్చింది బట్టతల వ్యక్తి. ఆ తరువాత వచ్చింది జుట్టు వున్న వ్యక్తి అని తేలింది. ఇద్దరన్నదమ్ములు నన్ను చాలా తెలివిగా మోసం చేసారు. చూస్తాను యెప్పటికైనా వాళ్లిద్దరు దొరక్కపోతారా, వాళ్లిద్దరికి క్షవరం చేసే అవకాశం నాకు రాకపోతుందా" చెప్పటం ముగించాడు బార్బర్. ●